క్లుప్తంగా

రెండు హైస్కూళ్లకు హెచ్‌ఎంల నియామకం

మాకవరపాలెం: మండలంలోని జి.కోడూరు, బూరుగుపాలెం ఉన్నత పాఠశాలలకు హెచ్‌ఎంలు నియామకమయ్యారని ఎంఈవో మూర్తి తెలిపారు. ప్రస్తుతం జరుగుతున్న పదోన్నతుల కౌన్సిలింగ్‌లో జి.కోడూరుకు సిహెచ్.జగదీష్, బూరుగుపాలెం హైస్కూల్‌కు జి.మహాలక్ష్మి హెచ్‌ఎంలుగా నియమితులయ్యారని పేర్కొన్నారు.

సత్యసాయి సేవా మార్గం అనుసరణీయం



నిరుపేదలకు నిత్యావసర సరకులు అందిస్తున్న మురళీకృష్ణ

కె.కోటపాడు : భగవాన్ సత్యసాయి చూపిన సేవా మార్గం అనుసరణీయమని కె.కోటపాడు గ్రామానికి చెందిన సత్యసాయి సేవా సంస్థల బాల వికాస్ గురువు ఎం.మురళీకృష్ణ అన్నారు. ప్రతి నెలా నారాయణ సేవలో భాగంగా పేదలకు ఆయన సొంత నిధులతో 15 రకాల నిత్యావసర సరకులను సమకూర్చుతున్నారు. వీటిని శుక్రవారం కె.కోటపాడులోని నిరుపేదల ఇంటికి వెళ్లి అందించారు. బియ్యం, పప్పు, చింతపండు, నూనె, పంచదార, తదితర నిత్యావసర సరకులు ఈ కిట్‌లో ఉన్నట్టు మురళీకృష్ణ తెలిపారు.

నేడు రాధాకృష్ణుల తీర్థం



కె.జె.పురం-దబ్బకుంట రహదారిలోని శ్రీరాధాకృష్ణుల విగ్రహాలు

మాడుగుల రూరల్: కె.జె.పురం-దబ్బకుంట రహదారిలోని రాధాకృష్ణుల తీర్థం శనివారం ఘనంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఉత్సవ కమిటీ సభ్యులు శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నామన్నారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి ఆలయం వద్ద భారీ అన్నసమారాధన కార్యక్రమం, రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు.

మండలానికి చేరిన పాఠ్య పుస్తకాలు



వడ్డాది స్టాక్ పాయింట్‌లో భద్రపరిచిన పాఠ్య పుస్తకాలు

బుచ్చెయ్యపేట: మండలంలో పలు పాఠశాలల విద్యార్థులకు పంపిణీ చేసే పాఠ్య పుస్తకాలు మండలానికి చేరుతున్నాయి. మొదటి విడతలో 19 వేల తరగతి పుస్తకాలు, 24,412 నోట్ పుస్తకాలు, 605 డిక్షనరీలు మండలానికి రాగా.. వడ్డాది హైస్కూల్ స్టాక్ పాయింట్‌లో భద్రపరిచారు. ఇక్కడి నుంచి పలు గ్రామాల పాఠశాలలకు పుస్తకాలను సరఫరా చేస్తున్నారు. బుచ్చెయ్యపేట మండలంలో ఉన్న 62 పాఠశాలల్లో 3,714 మంది విద్యార్థులుండగా.. ఇంకా యూనిఫాంలు, బూట్లు, బ్యాగులు రావాల్సి ఉంది.

రాయితీ దాణాను సద్వినియోగం చేసుకోండి



రైతులకు అందిస్తున్న దాణా ప్యాకెట్లు

బుచ్చెయ్యపేట: రాయితీపై అందిస్తున్న దాణాను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని బుచ్చెయ్యపేట పశువుల ఆస్పత్రి వైద్యాధికారి ఉమా మహేశ్వరి తెలిపారు. శుక్రవారం 11 గ్రామాలకు చెందిన 55 మంది పాడి రైతులకు దాణా బస్తాలను అందజేశారు. ఒక్కో దాణా బస్తా రూ. 1,100 కాగా.. రైతులకు 50 శాతం రాయితీపై రూ. 550కే అందిస్తున్నామన్నారు. సర్పంచ్‌లు సుంకరి లక్ష్మి, గోపిశెట్టి శ్రీను, రైతు సంఘ నాయకులు పూడి రామారావు పాల్గొన్నారు.

కార్మికుల బకాయిలు చెల్లించాలని వినతి

అనకాపల్లి టౌన్: ఎన్టీఆర్ ఆస్పత్రిలో పనిచేస్తున్న శానిటేషన్, సెక్యూరిటీ గార్డు కార్మికులకు బకాయిపడ్డ మూడు నెలల జీతాలు తక్షణమే చెల్లించాలని ఏపీ మెడికల్ కాంట్రాక్ట్, ఎంప్లాయీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) జిల్లా ప్రధాన కార్యదర్శి కోన లక్ష్మణ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎన్టీఆర్ ఆస్పత్రి సూపరింటెండెంట్ కృష్ణారావుకు వినతిపత్రం అందజేశారు.

ఆరోగ్యం.. గుట్కాయ స్వాహా!

కాలక్షేపం, సరదాగా ఈ ఒక్కసారికి.. అనుకుంటూ యువత వ్యసనాల బారిన పడి, జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. ఖైనీ, గుట్కా, సిగరెట్లు, పాన్‌మసాలా వంటి మత్తు పదార్థాలకు ఆకర్షితులవుతూ తమతో పాటు, తమ కుటుంబాలకు తీరని శోకాన్ని మిగుల్చుతున్నారు. ఇందుకు ఆరంభం కిరాణా, పాన్‌షాపులే. లాభార్జనకు అలవడి నిషేధిత గుట్కా, ఖైనీ, సిగరెట్లను విక్రయిస్తున్నారు. చోడవరం కేంద్రంగా జోరుగా సాగుతున్న ఈ వ్యాపారంపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు చేష్టలుడిగి చూస్తున్నారు. శనివారం(మే 31వ తేదీ) ప్రపంచ పొగాకు ఉత్పత్తుల వినియోగ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం..



షాపులో విక్రయానికి సిద్ధంగా ఉంచిన ఖైనీ, పాన్ పరాక్, గుట్కా ప్యాకెట్లు

- యథేచ్ఛగా ఖైనీ, గుట్కా, పాన్‌మసాలా విక్రయాలు
- 3 నుంచి 5 రెట్లు ఆదాయం ఆర్జిస్తున్న వ్యాపారులు
- పాన్‌షాపులు, కిరాణా దుకాణాలే విక్రయ కేంద్రాలు
- నిషేధమున్నా పట్టించుకోని అధికార యంత్రాంగం

చోడవరం: మండల కేంద్రం చోడవరంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న పాన్ షాపుల్లో మత్తు పదార్థాలు విచ్చలవిడిగా లభ్యమవుతున్నాయి. ఖైనీలు, గుట్కా, పాన్‌మసాలాలపై నిషేధం ఉన్నప్పటికీ దర్జాగా వాటిని విక్రయిస్తూ, సొమ్ము చేసుకుంటున్నారు. పరిశ్రమల్లో పనిచేసే కార్మికులతో పాటు సిమెంట్ పనులు చేసే తాపీ మేస్త్రీలు, రోజు కూలీలు గుట్కాలు వెంట లేనిదే పనులకు వెళ్లలేని పరిస్థితి. గుట్కా తింటూ పనులు చేసుకోవడం వీరికి అలవాటుగా మారిపోయింది. 15 నుంచి 35 ఏళ్ల మధ్య వయసున్న యువత కూడా ఈ వ్యసనాలకు బానిసలుగా మారుతున్నారు.

గుట్టుగా.. హోల్‌సేల్‌గా..

ఓ వైపు గంజాయి అక్రమ రవాణా ఏజెన్సీ నుంచి యథేచ్ఛగా సాగుతుండగా.. మరో వైపు నిషేధిత ఖైనీ, గుట్కా, పాన్‌పరాక్, తంబాకు వంటి మత్తు పదార్థాలు కిరాణా షాపుల్లో జోరుగా అమ్ముతున్నారు. హోల్‌సేల్ వ్యాపారులు ఖైనీ, గుట్కాలను ఒడిశా ప్రాంతం నుంచి గుట్టుగా తీసుకొస్తున్నారు. రెండు నియోజకవర్గాలకు ప్రధాన కేంద్రంగా పాడేరు ఏజెన్సీకి ముఖద్వారాగా ఉన్న చోడవరం పట్టణంలో ఖైనీ, గుట్కాల విక్రయం జోరుగా సాగుతోంది. చోడవరం కేంద్రంగా ఆర్టీసీ కాంప్లెక్స్, మెయిన్‌రోడ్డు, కోటవీధి, వ్యాపార వీధి, పాతబస్టాండ్ జంక్షన్, చినబజార్, కాలేజీ జంక్షన్, చీడికాడ రోడ్డు, కొత్తూరు జంక్షన్ ప్రాంతాల్లో కొన్ని షాపుల్లో ఖైనీ, గుట్కా, పాన్‌పరాక్ హోల్‌సేల్ వ్యాపారం యథేచ్ఛగా జరుగుతోంది. ఇక్కడి నుంచి పాడేరు, మాడుగుల, బుచ్చెయ్యపేట, కె.కోటపాడు, దేవరాపల్లి, చీడికాడ ప్రాంతాలకు కూడా ప్రత్యేక వాహనాల్లో ఇతర నిత్యావసర సరకుల మధ్యలో పెట్టి అక్రమంగా తరలిస్తున్నట్టు సమాచారం. ఏటా రూ.2కోట్లకు పైబడి గుట్కా హోల్‌సేల్ వ్యాపారం ఈ ప్రాంతంలో జరుగుతున్నట్టు అంచనా. గుట్టుచప్పుడు కాకుండా రవాణా చేసి అక్కడి నుంచి పాన్ షాపులకు రిటైల్ అమ్మకాలు చేస్తున్నారు. ఇటీవల కాలంలో ఖైనీ, గుట్కాలకు ధరలు విపరీతంగా పెంచి మరీ అమ్మకాలు సాగిస్తున్నారు. **ప్రస్తుతం రూ.5కు అటూఇటుగా ఉన్న ఖైనీ/గుట్కా ప్యాకెట్‌ను రూ.15–25 మధ్య అమ్ముతూ భారీగా ఆర్జిస్తున్నారు. దొంగచాటుగా అమ్ముతున్నందున అదనంగా ప్యాకెట్ దగ్గర రూ.8 నుంచి రూ.10 వరకూ లాభం వేసుకొని పాన్ షాపుల్లో వీటిని అమ్ముతున్నారు. మత్తు పదార్థాలకు బానిసలైన వారు అవి దొరికితే చాలు ఎంతైనా ఇచ్చి కొనుక్కొని** తినుతుండడంతో వీటికి గిరాకీ కూడా ఎక్కువగానే ఉంది. కోర్టు ఆదేశాలతో ప్రభుత్వం నిషేధించినా అమ్మకాలు మాత్రం యథేచ్ఛగా సాగుతుండడం ఆందోళన కలిగిస్తోంది. గుట్కాల అమ్మకాలపై దాడులు చేసి నివారించాల్సిన పోలీసులు, టాస్క్ ఫోర్స్, ఎక్సైజ్ అధికారులు చూసీచూడనట్టు వదిలేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి గుట్కా విక్రయాలను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

దాడులు విస్తృతం చేస్తాం..

పాన్ పరాక్, గుట్కా, ఖైనీ ప్యాకెట్ల అమ్మకాలు పూర్తిగా నిషేధం. వీటిని అమ్మిన వారిపై కేసులు నమోదు చేస్తాం. మరింత నిఘా పెంచి దాడులు చేసి విక్రయించే వారిని అరెస్ట్ చేస్తాం.

– అప్పలరాజు, సీఐ, చోడవరం

4న ‘వెన్నుపోటు దినం’



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్



సమావేశానికి హాజరైన ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు

- ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకుపోదాం..
- బైక్ ర్యాలీని విజయవంతం చేయండి
- మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్ పిలుపు

నర్సీపట్నం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వచ్చేనెల 4వ తేదీకి ఏడాది అవుతుందని, అదే రోజు వెన్నుపోటు దినం పేరుతో భారీ బైక్ ర్యాలీ ద్వారా ప్రభుత్వానికి నిరసన తెలియజేయనున్నామని మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ తెలిపారు. నియోజకవర్గంలోని ముఖ్య నాయకులతో వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శుక్రవారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందన్నారు. తల్లికి వందనం పథకం ఏమైందన్నారు. బాబు వస్తే జాబు గ్యారెంటీ అని ఎన్నికల సమయంలో ఊదరగొట్టి అధికారంలోకి వచ్చాక హామీ మరిచారన్నారు. అన్నదాత సుఖీభవ పేరుతో రూ.20 వేలు ఇస్తామని రైతులను సీఎం చంద్రబాబు దగా చేశారని విమర్శించారు. కూటమి ప్రభుత్వ విధానాలపై సమరశంఖం పూరించే సమయం ఆసన్నమైందన్నారు. హామీలు అమలు చేయకుండా ఇంకెన్నాళ్లు ప్రజలను మోసం చేస్తారని ప్రశ్నించారు. ప్రజల పక్షాన మన నిరసన గళాన్ని గట్టిగా వినిపించేందుకు చేపట్టిన బైక్ ర్యాలీని విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రుత్తల యర్రాపాత్రుడు మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అందరికీ ఇచ్చినా.. ఇంకా అంతకంటే ఎక్కువగా చంద్రబాబు ఇస్తాడని ఆశపడి ఓట్లు వేసి మోసపోయారన్నారు. గతంలో డ్వాక్రా రుణాలను మాఫీ చేస్తానని మహిళలను మోసం చేసిన ఘనుడు చంద్రబాబు అని ధ్వజమెత్తారు. పోరాటాలు తమకు కొత్త ఏమీ కాదని, ప్రభుత్వం మెడలు వంచేందుకు రోడ్డెక్కాల్సిన సమయం వచ్చిందన్నారు. మాజీ ఎమ్మెల్యే గణేష్ నాయకత్వంలో ప్రజా సమస్యలపై ఉద్యమిద్దామన్నారు. 4న జరిగే నిరసన కార్యక్రమానికి మహిళలు సైతం అధిక సంఖ్యలో తరలివచ్చేలా పార్టీ నాయకులు బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, వైస్‌చైర్మన్ తమరాన అప్పలనాయుడు, ఎంపీపీలు గజ్జలపు మణికుమారి, సాగిన లక్ష్మణమూర్తి, పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు లోచల సుజాత, పార్టీ పట్టణ అధ్యక్షుడు ఏకా శివ, నర్సీపట్నం, నాతవరం, మాకవరపాలెం మండల పార్టీ అధ్యక్షులు శానపతి వెంకటరత్నం, నాగేశ్వరరావు, చిటికెల రమణ, మాకవరపాలెం మాజీ ఎంపీపీ రుత్తల సత్యనారాయణ, పార్టీ గొలుగొండ మండల మాజీ అధ్యక్షుడు లెక్కల సత్యనారాయణ, పార్టీ నాయకులు చింతకాయల వరుణ్, సర్పంచ్‌లు, కౌన్సిలర్లు, వివిధ అనుబంధ విభాగాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

సాగులో యాంత్రీకరణ లాభదాయకం



రైతులతో మాట్లాడుతున్న కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ రాజ్‌కుమార్

రావికమతం: ఖరీఫ్ సాగుకు రైతులు సన్నద్ధం కావాలని కొండెంపూడి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ రాజ్‌కుమార్ కోరారు. యాంత్రీకరణతో వ్యవసాయం చేపట్టడం ద్వారా పని వేగం కావడంతో పాటు ఖర్చు తగ్గుతుందన్నారు. కొండెంపూడి కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలో దొండపూడి, జెడ్.బెన్నంవరం గ్రామాల్లో జిల్లా వ్యవసాయ శాఖల సహకారంతో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సాగుకు సంబంధించిన సలహాలు, సూచనలను శాస్త్రవేత్తల ద్వారా రైతులకు అందించాలన్న ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. అనకాపల్లి వ్యవసాయ పరిశోధన శాస్త్రవేత్త డాక్టర్ భవాని మాట్లాడుతూ రాబోయే ఖరీఫ్ సీజన్‌లో ఏ పంటలు వేసుకోవాలో వివరించారు. ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ పంట మార్పిడి వల్ల ఎర్రకుళ్లు, పసుపాక తెగుళ్లను నివారించవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి రూప, శాస్త్రవేత్తలు ఎస్.సత్తిబాబు, కిషోర్ కుమార్, కిరణ్‌కుమార్, వెంకటేషన్, సుగుణ, ఎం.విజేత, అగ్రికల్చర్ అసిస్టెంట్ కె.జగదీష్, గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు.

కె.జె.పురం జంక్షన్‌లో ఆక్రమణలపై చర్యలేవి?



మాడుగుల తహసీల్దారు రమాదేవికి ఫిర్యాదు చేస్తున్న రామకొండలరావు, తదితరులు

మాడుగుల రూరల్: కె.జె.పురం జంక్షన్‌లో ఆక్రమణలపై చర్యలేవని స్థానికులతో పాటు కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ అధ్యక్షుడు రాపేట రామకొండలరావు డిమాండ్ చేశారు. ఈ కూడలిలో ఆక్రమణలు తొలగించి, రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీ నిర్మించాలని ఈ ఏడాది మార్చి 10న కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు రోడ్లు, భవనాల శాఖ అధికారులు, పంచాయితీ సిబ్బంది మార్చి 19న రహదారికి ఇరువైపులా సర్వే చేసి, ఆక్రమణలను గుర్తించి మార్కింగ్ చేశారు. ఆక్రమణలు స్వయంగా తొలగించుకోవాలని, లేకపోతే తామే తొలగిస్తామని, గత నెల, ఈ నెలల్లో నోటీసులు కూడా ఇచ్చారు. అయినా ఎటువంటి ఆక్రమణలు గానీ, పనులు జరగలేదు. మరోవైపు ఈ సమస్య పరిష్కరించకుండా స్పందనలో వచ్చిన అర్జీని పూర్తిగా క్లోజ్ చేశారని సమాచార హక్కు చట్టం ప్రకారం శుక్రవారం తహసీల్దారు రమాదేవికి రామకొండలరావు, తదితరులు ఫిర్యాదు చేశారు. ఈ సమస్యపై మళ్లీ ఫిర్యాదు చేస్తామని, లేకపోతే స్థానికులతో కలిసి ధర్నా చేస్తామని ఆయన హెచ్చరించారు.

125 కొత్త పింఛన్ల మంజూరు

మాకవరపాలెం: మండలానికి 125 కొత్త సామాజిక పింఛన్లు మంజూరయ్యాయని ఎంపీడీవో చాయాసుధ శుక్రవారం తెలిపారు. ప్రభుత్వ ఆదేశాలతో మండలంలోని 15 సచివాలయాల పరిధిలో మొత్తం 125 పింఛన్లు మంజూరయ్యాయన్నారు. వీటిని వచ్చేనెల 12న లబ్ధిదారులకు అందజేస్తామన్నారు. ఆ రోజు సచివాలయాల వద్ద పింఛన్లు మంజూరు చేస్తామన్నారు.

రిజిస్ట్రేషన్‌తో చిరు వ్యాపారులకు మేలు



మాడుగుల వెలుగు కార్యాలయంలో మాట్లాడుతున్న ఎంపీపీ రాజారామ్

మాడుగుల రూరల్: ఉచిత ఉద్యమమ్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం ద్వారా చిరు వ్యాపారులకు ఎంతో మేలు జరుగుతుందని ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకట రాజారామ్ అన్నారు. మాడుగుల వెలుగు కార్యాలయంలో శుక్రవారం వ్యాపారులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లా పరిశ్రమల కార్యాలయం ప్రతినిధి మహేశ్ మాట్లాడుతూ గ్రామాల్లో చిరు వ్యాపారులకు ప్రభుత్వం ఇతోధికంగా ఆర్థిక సహాయం అందించేందుకు సచివాలయ సిబ్బంది ద్వారా గ్రామాల్లో ఇప్పటికే సర్వే చేపట్టామన్నారు. సర్వేలో నమోదు కాని వారిని కూడా నమోదు చేస్తామన్నారు. కిరాణా, హల్వా, కార్పెంటర్, ఇతర పనులు నిర్వహించే వారికి రుణాలు అందిస్తామన్నారు.

సమన్వయంతోనే మోదకొండమ్మ జాతర విజయవంతం

- ఎంపీపీ వెంకట రాజారామ్
- అధికారులతో సమీక్ష సమావేశం



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రాజారామ్

మాడుగుల రూరల్: ఉత్తరాంధ్ర ప్రధాన ఆరాధ్య దైవం, మాడుగుల గ్రామ ఇలవేల్పు మోదకొండమ్మ జాతరను విజయవంతంగా నిర్వహించడానికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకట రాజారామ్ కోరారు. వచ్చే నెల 3న జరిగే మోదమాంబ జాతర ఏర్పాట్లపై ఆయా శాఖల అధికారులతో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు, తదితరులు జాతర ఏర్పాట్లకు సంబంధించి పలు సూచనలు చేశారు. గ్రామంలో పారిశుధ్యం లోపించకుండా గ్రామ కార్మికులతో పాటు ఇతర గ్రామాలకు చెందిన మరో 40 మంది కార్మికులతో పనులు చేపడతామని పంచాయతీ ఈవో మూర్తి బాబు చెప్పారు. జాతర రోజున రెండు చోట్ల ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్టు వైద్యాధికారులు లీలాప్రసాదు, మాలంనాయుడు తెలిపారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఎంపీపీ సూచించారు. ట్రాన్స్‌కో ఏఈ, ఏడీఈలు మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో ఒక వాహనంలో ట్రాన్స్‌ఫారంలు, క్రేన్ సిద్ధంగా ఉంచుతామన్నారు. అగ్నిమాపక అధికారి రాజేశ్వరరావు మాట్లాడుతూ అగ్ని ప్రమాదాలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటామన్నారు. తాగునీటి సమస్య రాకుండా 9 ట్యాంకుల ద్వారా సరఫరా చేస్తామని పంచాయతీ అధికారులు తెలిపారు. అంగన్‌వాడీ కార్యకర్తలు వైద్య సిబ్బందితో కలిసి పని చెయ్యాలని ఎంపీపీ సూచించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాట్లు చేస్తామని ఎస్ఐ జి.నారాయణరావు పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీవో కొంకి అప్పారావు, తహసీల్దారు రమాదేవి, ఆలయ కమిటీ సభ్యులు దంగేటి సూర్యారావు, ఐసీడీఎస్ సీడీపీవో శ్రీదేవి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.


పరిశుభ్రతతోనే రోగాలు దూరం



స్ప్రేయింగ్ పనులు ప్రారంభిస్తున్న పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రసన్న, ప్రజాప్రతినిధులు

నాతవరం: రోగాలు వ్యాప్తి చెందకుండా ఉండాలంటే ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని నాతవరం పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రసన్న సూచించారు. నాతవరం ఎస్సీ కాలనీలో శుక్రవారం దోమల నివారణలో భాగంగా స్ప్రేయింగ్ పనులు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటీవల ఈ కాలనీలో రోగాలు వ్యాప్తిస్తున్నాయని స్థానిక ప్రజాప్రతినిధులు తమ దృష్టికి తీసుకురావడంతో దోమలు అరికట్టేందుకు పిచికారీ పనులు చేపడుతున్నామన్నారు. ప్రజలు కూడా వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు కాపారపు అప్పలనర్స, మాజీ ఎంపీపీలు నేతల విజయకుమార్, పారుపల్లి కొండబాబు, గ్రామ పెద్దలు, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.


ఘనంగా ముగిసిన హనుమాన్ జయంత్యుత్సవాలు




హనుమాన్ ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

రోలుగుంట: మండలం కేంద్రం రోలుగుంటలో ఈ నెల 22న ప్రారంభమైన హనుమాన్ జయంత్యుత్సవాలు శుక్రవారంతో ఘనంగా ముగిశాయి. ఇందులో భాగంగా ప్రతిరోజు స్వామివారి పేరున భక్తులు అభిషేకాలు చేశారు. రాత్రి వేళ స్వామివారి మాల ధరించిన భక్తులు భక్తి పారాయణం చేశారు. ముగింపు సందర్భంగా పెద్ద ఎత్తున భక్తులు ఆలయానికి వచ్చి పూజలు చేశారు. మధ్యాహ్నం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన నిర్వహించారు. కొండపాలెం, కొమరవోలు, తదితర గ్రామాల భక్తులు తరలివచ్చి స్వామి వారి ప్రసాదం స్వీకరించారు.

యోగాతో మానసిక ఉల్లాసం



కొత్తపల్లి కేజీబీవీ మైదానంలో యోగాసనాలు వేస్తున్న అధికారులు, సిబ్బంది



కె.కోటపాడులో యోగాసనాలను వేస్తున్న ఐసీడీఎస్ పీవో మంగతాయారు, తదితరులు

చీడికాడ: యోగాతో ఆరోగ్యం, మానసిక ఉల్లాసం వస్తుందని ఎంపీడీవో హేమసుందరరావు తెలిపారు. శుక్రవారం జి.కొత్తపల్లి కేజీబీవీ ఉన్నత పాఠశాల గ్రౌండ్‌లో యోగా తరగతులను నిర్వహించారు. అధికారులు, సిబ్బంది యోగాసనాలు వేశారు. నాలుగు రోజుల పాటు గ్రామాల్లో నిర్వహించిన యోగా తరగతులు శుక్రవారంతో ముగిసినట్లు ఆయన చెప్పారు. ప్రతి ఒక్కరు యోగాను కొనసాగించాలని ఆయన ఆకాంక్షించారు.

కె.కోటపాడు : కె.కోటపాడు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఐసీడీఎస్ పీవో మంగతాయారు పర్యవేక్షణలో అంగన్‌వాడీ కార్యకర్తలు యోగాసనాలు వేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ అప్పలరాజు, ఎంఈవో సత్యనారాయణ, డీవీడీ ప్రసాద్, మండల ఇంజినీర్ సుమతి పాల్గొన్నారు.

ఆర్టీసీ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

- మద్దిలపాలెం డిపో మేనేజర్ అరుణకుమారి
- దేవరాపల్లి, ఎ.కొత్తపల్లి, వాకపల్లి గ్రామాల్లో పర్యటన



కొత్తపల్లి ప్రజలతో మాట్లాడుతున్న మద్దిలపాలెం ఆర్టీసీ డిపో మేనేజర్ అరుణకుమారి, తదితరులు

దేవరాపల్లి: ఆర్టీసీ బస్సు సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మద్దిలపాలెం డిపో మేనేజర్ ఎస్.అరుణకుమారి కోరారు. ఈ మేరకు మండలంలోని దేవరాపల్లి, వాకపల్లి, ఎ.కొత్తపల్లి, ముషిడిపల్లి గ్రామాల్లో డిపో అసిస్టెంట్ మేనేజర్ ఎం.మాధురితో కలిసి శుక్రవారం ఆమె పర్యటించారు.

ఈ సందర్భంగా ఆయా గ్రామాల ప్రజలను కలిసి ఆర్టీసీ అందిస్తున్న బస్సు సదుపాయాలపై, సమస్యలపై ఆమె స్వయంగా అడిగి తెలుసుకున్నారు. బస్సుల టైమింగ్స్ మార్పు చేయాలని ప్రయాణికులు కోరగా.. మెరుగుపర్చేందుకు కృషి చేస్తామని ఆమె హామీ ఇచ్చారు. వాకపల్లికి ఉదయం, సాయంత్రం బస్సు సదుపాయం కల్పించడం పట్ల డిపో మేనేజర్‌కు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియజేశారు. వాకపల్లికి మధ్యాహ్నం సమయంలో బస్సు సర్వీస్ నడపాలని కోరగా.. సాధ్యాసాధ్యాలను పరిశీలించి నడిపేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రయాణికుల సంఖ్య ఆధారంగా అవసరమైన చోట బస్సు సేవలను మరింత మెరుగుపరుస్తామన్నారు. ఎ.కొత్తపల్లి సర్పంచ్ చింతల సత్య వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

విత్తనోత్పత్తిపై దృష్టి సారించాలి

పాయకరావుపేట: యాంత్రీకరణ పద్ధతులను పాటించి కూలి ఖర్చులు తగ్గించుకోవాలని శాస్త్రవేత్తలు, అధికారులు కోరారు. వికసిత కృషి సంకల్ప అభియాన్‌లో భాగంగా మండలంలో శ్రీరాంపురం, కేశవరం గ్రామాల్లో బీసీటీ కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో వ్యవసాయ శాఖ సహకారంతో శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ప్రభాకర్ మాట్లాడుతూ కొబ్బరిలో విత్తనోత్పత్తి, విత్తన ఎంపిక, భూసార పరిరక్షణకు అంతర పంటల యాజమాన్యం గురించి వివరించారు. బీసీటీ కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు బండి నాగేంద్ర ప్రసాద్, డాక్టర్ ఎం.శివ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా భూసార సంరక్షణ, నేల ఆరోగ్య పరిరక్షణ గురించి, కొబ్బరి, వరి పంటలలో ముందస్తు సస్యరక్షణ చర్యల గురించి వివరించారు. కొబ్బరిలో తట్టుకాయల నివారణ, ఎరువుల యాజమాన్యం గురించి వివరించారు. ఏవో పి.ఆదినారాయణ మాట్లాడుతూ పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ వంటి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో అభ్యుదయ రైతులు, రైతు సేవా కేంద్రాల సిబ్బంది, వీరబాబు, నాగశరత్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది జోగారావు తదితరులు పాల్గొన్నారు.